క్లుప్తంగా

వ్యాపార సముదాయాలు సర్దుకోండి

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం తూర్పు వీధిలో ఉన్న వ్యాపార సముదాయాలు డ్రైనేజీ లోపలికే సర్దుకోవాలని మఠం ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ తెలిపారు. ఆయన ఆదేశాల మేరకూ ఆదివారం మఠం సిబ్బంది వ్యాపారులకు హెచ్చరికలు జారీ చేశారు. సోమవారం ఉదయం 10గంటల లోపు వ్యాపారులు సర్దుకొని వ్యాపారాలు చేసుకోవాలని, డ్రైనేజీని దాటి వస్తే తామే తొలగిస్తామని తెలిపారు. ప్రతి వ్యాపారి యాత్రికులను దృష్టిలో ఉంచుకుని మఠం అభివృద్ధికి సహకరించాలన్నారు. రథం సమీపంలో ఉన్న పాడుబడిన సత్రాలను కూడా అభివృద్ధిలో భాగంగా రెండు రోజుల క్రితం తొలగించామన్నారు.

రేపు నెర్రవాడలో రెవెన్యూ సదస్సు

చాపాడు : మండల పరిధిలోని నెర్రవాడ గ్రామంలో మంగళవారం రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దారు రమాకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకూ నిర్వహించనున్న సమావేశంలో భూ సమస్యలపై రైతులు, ప్రజలు ఫిర్యాదు చేయవచ్చన్నారు. సదస్సులో తమ దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపటం జరుగుతుందని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ఉప్పలూరులో

కాశినాయన : మండలంలోని ఉప్పలూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దారు రవిశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు భూ సమస్యలు ఏవైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎఫ్ఎల్ఎన్ శిక్షణను వాయిదా వేయాలి



మాట్లాడుతున్న పుల్లయ్య

పోరుమామిళ్ల : ఎఫ్ఎల్ఎన్ శిక్షణా కార్యక్రమాన్ని వాయిదా వేయాలని ఎస్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పుల్లయ్య, జయరామిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ నెల 11 నుంచి ఎస్ఏ 1 పరీక్షలు ప్రారంభమవుతున్నాయని తెలిపారు. విద్యా శాఖ అధికారులు షెడ్యూల్ విడుదల చేసే ముందు అన్నింటినీ దృష్టిలో పెట్టుకోవాలన్నారు. పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు శిక్షణకు హాజరైతే ఐదు తరగతులకు ఒక్క ఉపాధ్యాయుడే పరీక్ష నిర్వహించడం కష్టమన్నారు. ఒకే సమయంలో శిక్షణా కార్యక్రమాలు, పరీక్షలు నిర్వహించడం ఉపాధ్యాయులను ఆందోళనకు గురి చేస్తున్నదని పేర్కొన్నారు.

వృద్ధులకు దుస్తులు పంపిణీ



కలసపాడు ఆర్సీఎం చర్చిలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు

కలసపాడు : స్థానిక ఆర్సీఎం చర్చి విచారణ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 150 మంది వృద్ధులకు చిత్తాశౌరిరెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సహకారంతో సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమస్‌రెడ్డి దంపతులు క్రిస్మస్, నూతన సంవత్సరాలను పురస్కరించుకుని ఆదివారం సంస్థ ప్రతినిధులు ఎల్.ప్రసాద్‌రెడ్డి, జి.శ్రీకాంత్‌రెడ్డి ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద వృద్ధులు పండుగలను ఆనందంగా జరుపుకోవాలనే ఉద్దేశ్యంతో దుస్తుల పంపిణీ కార్యక్రమం చేపట్టారన్నారు. విచారణ గురువులు రెవ. ఫాదర్ కొత్తపల్లె మనోహర్ మాట్లాడుతూ దాతల సహకారం మరువలేనిదని కొనియాడారు.

నేడు సీపీఐ నిరసన

కడప వైఎస్ఆర్ సర్కిల్: విద్యుత్తు ఛార్జీలను తగ్గించాలని కోరుతూ కడప ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు సీపీఐ కడప నగర కార్యదర్శి ఎస్.వెంకట శివ పేర్కొన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ అదానీతో విద్యుత్తు ఒప్పందాలను రద్దు చేయాలని దేశ వ్యాప్తంగా నిరసన చేపడుతున్నామని తెలిపారు.

వైభవంగా అమ్మవారి కల్యాణం

కడప కల్చరల్: కడప నగరంలోని విజయదుర్గాదేవి ఆలయంలో ఆదివారం అమ్మవారి కల్యాణం వైభవంగా జరిగింది. ప్రతి నెలా రెండో ఆదివారం విజయదుర్గ, మల్లికార్జునుల కల్యాణోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా తొలుత ఆలయ ప్రాంగణంలో వేద పండితులు ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు జరిపారు. స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులను వధూవరులుగా అలంకరించి కల్యాణ వేదికపై కొలువు దీర్చారు. అనంతరం కల్యాణం వైభవంగా సాగింది.

కూరగాయల సాగుతో లాభాలు



పెడుగుపల్లె వద్ద సాగు చేసిన టమోటా పంట



సిద్ధమూర్తిపల్లె వద్ద సాగు చేసిన తేజ రకం మిరప

- శీతాకాలంలోనూ పంటకు అనుకూలం
- విత్తన ఎంపికలో జాగ్రత్తలు

కలసపాడు : కూరగాయల సాగుకు శీతాకాలం కూడా అనుకూలంగా ఉంటుందని, అధిక ఆదాయాన్ని ఇచ్చే పంటలు కూడా అనేకం ఉన్నాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ముఖ్యంగా దుంప కూరలు, క్యాబేజీ, కాలీఫ్లవర్‌తో పాటు ఏడాదంతా వచ్చే టమోటా, మిరప, వంగ పంటలు ఈ సీజన్‌లో సాగు చేయవచ్చని ఉద్యాన నిపుణులు సూచిస్తున్నారు. ఖరీఫ్ పంటలతో పోలిస్తే రబీలో దిగుబడులు ఎక్కువగానే ఉంటాయని అంటున్నారు.

మెలకువలు తప్పనిసరి

రబీలో కూరగాయల సాగులో నాణ్యమైన దిగుబడులు తద్వారా అధిక నికర ఆదాయం పొందాలంటే రైతులు కొన్ని మెలకువలు పాటించాలి. నీటి సౌకర్యం ఉంటేనే సాగుకు సిద్ధం కావాలి. చీడపీడలను తట్టుకుని దిగుబడిని ఇచ్చే రకాలను ఎంచుకోవాలి. ఆయా ప్రాంతాల్లో సిఫార్సు చేసిన వంగడాలనే వాడాలి. రబీలో చలి ఎక్కువ ఉండటం వలన సూక్ష్మధాతు పోషకాలు లోపించే అవకాశాలు ఎక్కువ. కాబట్టి సూక్ష్మధాతు ఎరువులను సిద్ధం చేసుకోవాలి.

హైబ్రిడ్ విత్తనాలతో దిగుబడులు

కూరగాయల సాగులో హైబ్రిడ్ విత్తనాల వలన దిగుబడులు పెరుగుతాయి. అందువల్ల హైబ్రిడ్ విత్తనాలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. అయితే నాణ్యత లేని విత్తనాలు మార్కెట్‌లో ఉండే అవకాశం ఉంది. కాబట్టి విత్తనాలు కొనేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటించాలి. విత్తన సంచిపై లేబిల్‌లో ఉన్న ప్రమాణాలు, మొలక శాతం, వెన్ను స్వచ్ఛత, భౌతిక స్వచ్ఛత ఇతర పదార్థాల వివరాలు పరీక్షించుకుంటే మంచిది.

నారు పెంపకం

విత్తన మొలక శాతం పరీక్షించిన తర్వాతే నారు మడులు పెంచుకోవాలి. గింజలను పేపర్‌లో వరుసగా ఒకదాని పక్కన మరొకటి పెట్టి పేపర్ చుట్టాలి. ఆ తర్వాత చీకట్లో ఉంచి ఉదయం, సాయంత్రం పూట నీరుతో తడి చేయాలి. వంగ, టమోటా విత్తనాలు 5 నుంచి 6 రోజులు, మిరప 10 నుంచి 11 రోజుల్లో మొలకెత్తుతాయి. ఆ తర్వాత 100 విత్తనాలకు ఎన్ని మొలకెత్తితే అంత శాతంగా నిర్ధారించుకోవాలి.

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు అవసరం



రైతులు కూరగాయలు పండించడానికి శీతాకాలం అనువుగా ఉంటుంది. కాకపోతే కూరగాయల విత్తనాలను విత్తన సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి. నాసిరకం విత్తనాలతో డబ్బు, శ్రమ వృథా అవుతాయి. ప్రభుత్వం గుర్తించిన కంపెనీ విత్తనాలనే ఉపయోగించాలి. విత్తనశుద్ధి చేయడం మరిచిపోవద్దు. విత్తన సంచిని పారవేయకుండా జాగ్రత్తగా భద్రపరుచుకోవాలి. కొనుగోలు సమయంలో విధిగా రసీదు తీసుకోవాలి. లైసెన్సు ఉన్న విత్తన విక్రయదారుల వద్దనే కొనుగోలు చేయాలి. – శ్రీనివాసులరెడ్డి, ఉద్యానశాఖ అధికారి, పోరుమామిళ్ల

బీసీల సంక్షేమానికి కృషి చేస్తా



ఎన్నికైన ది బీసీప్రజా చైతన్య సమాఖ్య నూతన కమిటీ సభ్యులు

ప్రొద్దుటూరు కల్చరల్ : బీసీల సంక్షేమానికి కృషి చేస్తానని బీసీ ప్రజా చైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు పేర్కొన్నారు. స్థానిక జమ్మలమడుగు బైపాస్ రోడ్డులోని అలంకార్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ది బీసీ ప్రజా చైతన్య సమాఖ్య నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ రాజకీయ పార్టీలు తమ పార్టీకి బీసీలే వెన్నముక అని చెబుతూ రాజ్యాధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోవడంలేదన్నారు. బీసీలను రాజకీయ నాయకులు ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారేగానీ, వారికి రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

నూతన కమిటీ ఎంపిక

ప్రొద్దుటూరు బీసీ ప్రజా చైతన్య సమాఖ్య నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొర్రా రామాంజనేయులు, సమాఖ్య ప్రధాన కార్యదర్శిగా దేవేంద్రుడు, కోశాధికారిగా మడకా సంటెయ్య, ఉపాధ్యక్షులుగా వేల్పుల భాస్కర్‌యాదవ్, కొత్తపల్లి శ్రీను, సుంకర వేణు, జీసీ పుల్లయ్య, కార్యదర్శిగా భాస్కరరావు, పోసా ఆదినారాయణ, సహాయ కార్యదర్శులుగా తుపాకుల చౌడయ్య, పరమేశ్వరరావు, గౌరవ సలహాదారులుగా గజ్జల చంద్రమౌళి, జయరాం యాదవ్, మల్లిఖార్జున, మునిస్వామి, నాగయ్య, శ్రీనివాసమూర్తి ఆచారితోపాటు పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

కూటమి ప్రభుత్వ అబద్ధాలన్నీ బట్టబయలు

ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి



ఖాజీపేట : అసత్య ప్రచారాలతో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విషం చిమ్మి, ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ అబద్ధాలన్నీ ఒక్కొక్కటిగా బట్టబయలవుతున్నాయని ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం రెడ్యం విలేకరులతో మాట్లాడుతూ.. విశాఖలో కంటైనర్‌లో 25వేల కిలోల డ్రగ్స్ ఉన్నాయని జగన్‌పై ఎన్నికల సమయంలో విషం చిమ్మి లబ్ధి పొందారని, నేడు సీబీఐ విచారణలో అది అవాస్తమని తేలిందన్నారు. సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వం దీనిపై ప్రజలకు సమాధానం చెప్పాలని, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భూముల రీ సర్వేపై అవాస్తవాలు నమ్మబలికి, నమ్మించి రాజకీయ లబ్ధి పొంది నేడు రీ సర్వే కొనసాగిస్తామనడం వారి నీచ రాజకీయానికి పరాకాష్టగా ఆయన అభివర్ణించారు.

కేజీబీవీ ఉద్యోగులకు ఎంటీఎస్ అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రహాసరెడ్డి

పోరుమామిళ్ల : కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ వెంటనే ఎంటీఎస్ (మినిమం టైమ్ స్కేల్) అమలు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ చంద్రహాసరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన కార్యకర్తలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాలికల విద్యాభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన కేజీబీవీల్లో పని చేస్తున్న సీఆర్టీలు, పీజీటీలు, స్పెషల్ ఆఫీసర్లు, బోధనేతర సిబ్బందికి ఉద్యోగ భద్రత, ఆర్థిక భద్రత, లేకపోవడం అన్యాయమని వాపోయారు. విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలని అహర్నిశలు శ్రమిస్తున్న కేజీబీవీ ఉద్యోగులకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర నాయకులు పి. రమణారెడ్డి, సుబ్రమణ్యం, జిల్లా నాయకులు కృష్ణారెడ్డి, పుల్లారెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాసులు, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నేడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాక

ప్రొద్దుటూరు : జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్.సవిత సోమవారం ఉదయం ప్రొద్దుటూరుకు రానున్నారు. ఉదయం 9.30 గంటలకు మండలంలోని దొరసానిపల్లె గ్రామంలో జరిగే రెవెన్యూ సదస్సుకు మంత్రి హాజరుకానున్నారు.

నేడు సోలార్ మోడల్ విలేజ్‌పై సమావేశం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండలం గోపవరం గ్రామాన్ని సోలార్ మోడల్ విలేజ్‌గా అధికారులు ఎంపిక చేశారు. ఈ విషయంపై సోమవారం ఉదయం 10.30 గంటలకు కొర్రపాడు రోడ్డులోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్‌పీడీసీఎల్ ఈఈ రమణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకింద 5వేల జనాభా కలిగిన గ్రామాల్లో ఈ పథకాన్ని అమలు చేస్తే కేంద్ర ప్రభుత్వం కోటి రూపాయలు నజరానాగా ఇవ్వనుందని తెలిపారు.

జూదరుల అరెస్టు

పోరుమామిళ్ల : మండలంలోని కవలకుంట్ల హరిజనవాడలో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 2,250 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. ఆదివారం విశ్వసనీయంగా తెలిసిన సమాచారంతో దాడి చేసి నిందితులను అరెస్టు చేసి, కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

11న భగవద్గీత సామూహిక పారాయణం

ప్రొద్దుటూరు : శివ దర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక త్యాగరాజరెడ్డి కల్యాణ మండపంలో ఈ నెల 11న సాయంత్రం 5.30 గంటలకు వేయి మందితో భగవద్గీత సామూహిక పారాయణం చేపడుతున్నట్లు ట్రస్టు నిర్వాహకురాలు సరస్వతి మాతాజీ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక శాస్త్రీనగర్‌లోని ట్రస్టు కార్యాలయంలో భగవద్గీత పఠన పోటీలలో విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తామని తెలిపారు.

ఫిబ్రవరి 8న రచయితల సభ

కడప కల్చరల్ : సాహితీ వైభవాన్ని చాటేలా మహాసభలను నిర్వహించేందుకు అందరూ కలిసి రావాలని వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక బ్రౌన్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం మహాసభల సన్నాహక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 8, 9వ తేదీలలో ఈ సభలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. సభలకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగార్జునరెడ్డి, పూర్వ అధికార భాషా సంఘం అధ్యక్షుడు మండలి బుద్ధ ప్రసాద్‌ను ఆహ్వానించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జింకా సుబ్రహ్మణ్యం, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, పొదిలి నాగరాజు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి ఉద్యమిస్తాం

సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

ప్రొద్దుటూరు : జిల్లా సమగ్రాభివృద్ధికై ఉద్యమించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర పిలుపునిచ్చారు. మండలంలోని పెన్నానగర్ సీపీఐ కార్యాలయంలో ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు నియోజకవర్గాల సీపీఐ కార్యదర్శులతో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గాలి చంద్ర మాట్లాడుతూ జిల్లాలో విస్తారంగా ఖనిజ నిక్షేపాలున్నాయని, పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ప్రత్యక్షంగా 25వేల మందికి, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి కలుగుతుందన్నారు. జిల్లాలో రోడ్లన్నీ ధ్వంసమై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు. అర్థాంతరంగా ఆగిపోయిన పనులను పూర్తి చేయాలని కోరుతూ పోరాటాలకు సమాయత్తం అవుతామన్నారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు పి.సుబ్బరాయుడు, బి.రామయ్య, శ్రీరాములు, భాస్కర్, చంద్రశేఖర్, హరి, శాఖా కార్యదర్శులు వరత్, ప్రమీల, హృదయానంద్, రామకృష్ణ, ప్రసాద్, యేసోబ్, శివయ్య, బాషా, ఏఐఎస్ఎఫ్ లీలా కృష్ణ, పీటర్, వాసు, మౌనిష్, దస్తగిరి, చాంద్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంపై ఒత్తిడి తేవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని

బద్వేలు అర్బన్ : కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం రాష్ట్రంలోని ఎంపీలు పార్లమెంటు సమావేశాల్లో కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డీవైఎఫ్ఎం జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన డీవైఎఫ్ఐ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు విషయంలో కేంద్రం వైఖరి దారుణంగా ఉందని, పార్లమెంటు సమావేశాల్లో ఎంపీలు అడిగిన ప్రశ్నకు కడప ఉక్కు సమస్య తమ దగ్గర లేదని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి ప్రకటించడం దారుణమన్నారు. వలసలు, కరువుతో అల్లాడుతున్న రాయలసీమ ప్రాంతంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటైతే లక్షలాది మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. సమావేశంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని పెంచేలా సాంకేతికను ఉపయోగించాలి



మాట్లాడుతున్న డా.బి.సుశీల

చాపాడు : విద్యా బోధనలో నైపుణ్యాన్ని పెంచే విధంగా ఆధునిక సాంకేతికను ఉపయోగించాలని జేఎన్‌టీయూఏ డెవలపింగ్ సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ డా.బి.సుశీల పేర్కొన్నారు. స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ)లో ఆదివారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ట్రైనర్ డా.బి.సుశీల మాట్లాడుతూ.. టీచరు విద్యార్థుల పట్ల ఎలా ప్రవర్తించాలి, వారి సమస్యలను ఏ విధంగా అడిగి తెలుసుకుని పరిష్కరించాలనే అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశాల సమయంలో సెల్ ఫోను వాడకాన్ని నిషేధించాలని, బోధనలో టెక్నాలజిని వాడుతూ విద్యా బోధన కొనసాగించాలన్నారు. సోషల్ ఎమోషనల్ లర్నింగ్ సిస్టమ్ అండ్ కమ్యూనికేషన స్కిల్స్ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనుకాకుండా ఉపాధ్యాయులు విద్యా బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో సీబీఐటీ అకడమిక్ డీన్ డా.జి.శ్రీనివాసులరెడ్డి, ప్రిన్సిపాల్ డా.ఎస్.శృతి తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తులను కాపాడాలి

ప్రొద్దుటూరు క్రైం : వక్ఫ్ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత ముస్లింలందరిపై ఉందని ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఖాజామొహిద్దీన్ తెలిపారు. స్థానిక ముబారక్ ఫంక్షన్ హాల్‌లో వక్ఫ్ సవరణ బిల్లు–2024పై ఆదివారం చర్చా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాజామొహిద్దీన్ మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తుల ద్వారా వచ్చే ఆదాయంతో పేద ముస్లింల విద్య, వైద్య, సంక్షేమం తదితర సౌకర్యాలను మెరుగుపరుచుకోవచ్చని చెప్పారు. గెజిట్‌లో చూపబడిన ఆస్తులు వక్ఫ్ బోర్డు ఆధీనంలో లేవని, దేశంలో 70 శాతం ఆస్తులు అన్యాక్రాంతమయ్యాయని తెలిపారు. బోర్డులో ఇప్పటి వరకు ముస్లిం మహిళలు లేరని, ఇప్పుడు ఇద్దరు మహిళలను నియమిస్తే ఎవరికి మేలు జరుగుతుందని వారు ప్రశ్నించారు. ముస్లిం సోదరులున్న ప్రతి చోట వక్ఫ్ పరిరక్షణ కమిటీలుగా ఏర్పడి ఆస్తులను కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమాల్‌బాషా, ఇర్ఫాన్‌బాషా, ఫరీద్‌బాషా, కుతుబుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడ లైలా గ్రీన్ మెడోస్ వద్ద 2025 జనవరి, 5న నిర్వహించే హైందవ శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయాలని వీహెచ్‌పీ జిల్లా కన్వీనర్ మల్లిఖార్జునరావు కోరారు. స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో హైందవ శంఖారావం ఛలో విజయవాడ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల్లో పనిచేస్తున్న అన్యమతస్తులను తొలగించాలని, పూజా కైంకర్యాల్లో, ప్రసాదాల్లో నాణ్యత పాటించాలని కోరారు. దేవాలయ ట్రస్టులలో రాజకీయ ప్రమేయం లేకుండా హిందూ భక్తులతో నిర్వహించాలని, పరిసరాల్లో దుకాణాలను హిందువులకే కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. హైందవ శంఖారావానికి హిందువులు తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జింకా మార్కండేయ, నాగమునిరెడ్డి, కాల్వ చలపతి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

నా కక్షిదారులైన ప్రొద్దుటూరుకు చెందిన పాలేపల్లి కృష్ణమూర్తి గారి కుమారులు 1) సుబ్బారావు 2) రాధాకృష్ణ 3) వేణు 4) సురేష్ గార్ల వలన సరియైన ఇన్‌స్ట్రక్షన్స్ తీసుకొని ఇచ్చు పబ్లిక్ నోటీసు ఏమనగా ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని గురించి నా కక్షిదారులకు 30% భాగం ఉన్నదని ప్రొద్దుటూరుకు చెందిన శ్రీ మిట్టా వెంకటేశ్వరరావు గారితో తగాదా పెడుతున్నారు. దాని గురించి రాజశ్రీ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు O.S.No.175/2009 దావా దాఖలు అయి 20.11.2024వ తేదీన సదరు కోర్టువారు ఇచ్చిన జడ్జిమెంటు పైన నా కక్షిదారులు అప్పీలు దాఖలు చేసుకుంటున్నారు. కాబట్టి దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని గురించి ఎవ్వరేగాని ఎటువంటి క్రయ విక్రయాలు జరుపకూడదు. అవి చెల్లనేరవు. వాటిపైన, వారిపైన సరియైన చట్టపరమైన చర్యలు తీసుకొనబడును.

షెడ్యూలు

Landed Properties Situated in Proddatur Reg District Proddatur Sub Reg District in the Panchayath of Kotthapalli in the village of fields of Modameedhipalli

1) Govt Dry S.No.111-2 Pyki Extent Ac.0.53½ Cents or 0.216 Hec

Bounded by: On **East:** Land of Nagumalla Subbanna, **West:** Land of Vallamkondu Adi Narayana Guptha now in the hands of Vundela Venkata Reddy and Chemika Jaya Lakshumma etc.,
North: Land of Sunku Subba Rao.
South: Item No.2 of Plaint schedule
With all easement Rights

2) Govt Dry S.No.111-2B Pyki Extent Ac.0.55 Cents or 0.223 Hec Pura.

వి.రమేష్ బాబు, అడ్వకేట్,
8/581, గిడ్డంగి వీధి, ప్రొద్దుటూరు. సెల్:9441500950.

ప్రతి ఒక్కరూ భగవద్గీతను పఠించాలి



పాల్గొన్న భక్తులు



మాట్లాడుతున్న భక్తి వికాస్ స్వామి మహారాజ్

భక్తి వికాస్ స్వామి మహారాజ్

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతి ఒక్కరూ భగవద్గీత పఠించాలని ఇస్కాన్ గురువు శ్రీమద్ భక్తి వికాస్ స్వామి మహారాజ్ పేర్కొన్నారు. ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ చేస్తున్న పర్యటనలో భాగంగా ఆదివారం కొర్రపాడు రోడ్డులోని ఇస్కాన్ మందిరానికి స్వామిజీ వచ్చారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ భగవద్గీత చదవడంతో మంచి చెడు విచక్షణా జ్ఞానం తెలుస్తోందన్నారు. తాను లండన్‌లో పుట్టి 20 ఏళ్ల వయసులో హరే రామ.. హరే కృష్ణ మహామంత్రంతో సంపూర్ణంగా కృష్ణచైతన్యాన్ని స్వీకరించడం జరిగిందన్నారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా కులం, మతం, పేద–ధనిక అనే తారతమ్యం లేకుండా ప్రజలంతా అంతులేని శారీరక, మానసిక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. వారి జీవితాల్లో వెలుగు నింపి ప్రశాంతమైన మానవ జీవిత పరిపూర్ణత్వాన్ని తెలియచేయాలనే ఉద్దేశంతో ప్రపంచ వ్యాప్తంగా పర్యటిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. సోమవారం ఉదయం 8 గంటలకు ఇస్కాన్ మందిరం, సాయంత్రం 6 గంటలకు బొల్లవరంలోని ఆంజనేయస్వామి విగ్రహ సమీపంలో భగద్గీత ప్రవచనాలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో దీక్షా గురువు త్రిదండి సన్యాసి భక్తివికాస స్వామి, శిక్షా గురువు శ్రీమాన్ మదురేసు దాసు, ఇస్కాన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.